జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
07 సోమవారం, సెప్టెంబర్ 2026 పేజీలు:09



07లో

## కాంగ్రెస్ పాలనకు కౌంట్‌డౌన్ మొదలైంది!

- ఆటో కార్మికుల నుంచి రైతులు, ఉద్యోగుల వరకు అందరూ ఇబ్బందుల్లోనే.. మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్

# ఎన్‌హెచ్-44పై ఘోర రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి

## - లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు.మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 06:

జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని ఎన్‌హెచ్-44పై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా,మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.హైదరాబాద్ నుంచి గద్వాల వైపు వస్తున్న కారు ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.మల్కాజ్‌గిరికి చెందిన పోతకుమూరి మాధురి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.ఆమె భర్త పోతకుమూరి సాయిరాం (37) తన స్నేహితులు వతానిక్, ముఖేష్,రాఘవలతో కలిసి ఆదివారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి గద్వాలకు బయలుదేరారు. గద్వాల నుంచి జోగుళాంబ అమ్మవారి దర్శనానికి వెళ్లేందుకు వారు ప్రయాణిస్తున్నట్లు తెలిపారు.

మిగతా 2 లో





# కేటీ దొడ్డి ఏపీఎంపై అవినీతి ఆరోపణలు జిల్లా అధికారుల మౌనం ఎందుకు?

## - ఆరోపణలపై విచారణకు వెనుకడుగు ఎందుకు? వాస్తవాలను తేల్చాలని స్థానికుల డిమాండ్

**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 06:**

గద్వాల,సెప్టెంబర్ 06: జోగులాంబ గద్వాల జిల్లా కేటీ దొడ్డి మండల మహిళా సమాఖ్య ఏపీఎంపై అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో జిల్లా అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆరోపణలు బహిరంగంగా వెలుగులోకి వచ్చినప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటివరకు స్పష్టమైన స్పందన ఇవ్వకపోవడం చర్చనీయాంశంగా మారింది.ప్రభుత్వ సంక్షేమ పథకాలు,మహిళా సంఘాల కార్యకలాపాల అమలులో కీలక బాధ్యతలు నిర్వహించే అధికారిపై అవినీతి ఆరోపణలు రావడం సాధారణ విషయం కాదని పలువురు పేర్కొంటున్నారు. ఆరోపణల్లో వాస్తవం ఎంత? అవి నిరాధారమా? అనే విషయాలను తేల్చేందుకు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

**మౌనం వెనుక మర్మమేంటి?**

అవినీతి ఆరోపణలు నిజమైతే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి. ఆరోపణల్లో వాస్తవం లేదంటే అధికారికంగా స్పష్టత ఇవ్వాలి. కానీ ఇప్పటివరకు విచారణకు ఆదేశించకపోవడం, అధికారులు మౌనం వహించడం వల్ల అనుమానాలకు మరింత తావిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి.

**విచారణకు ఆదేశాలెప్పుడు?**




కేటీ దొడ్డి ఏపీఎంపై వచ్చిన ఆరోపణలపై జిల్లా స్థాయిలో సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ప్రభుత్వ నిధులు,మహిళా సంఘాల కార్యక్రమాలకు సంబంధించిన వ్యవహారాల్లో పూర్తి పారదర్శకత ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మొదటిపేజీ తరువాయి

# ఎన్‌హెచ్-44పై ఘోర రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి

## - లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు.మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 06:**

జోగుళాంబ గద్వాల జిల్లా పరిధిలోని ఎన్‌హెచ్-44పై ఆదివారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా,మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు.హైదరాబాద్ నుంచి గద్వాల వైపు వస్తున్న కారు ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.మల్కాజ్‌గిరికి చెందిన పోతకుమూరి మాధురి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.ఆమె భర్త పోతకుమూరి సాయిరాం (37) తన స్నేహితులు వతానిక్, ముఖేష్,రాఘవలతో కలిసి ఆదివారం తెల్లవారుజామున సుమారు 2 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి గద్వాలకు బయలుదేరారు. గద్వాల నుంచి జోగుళాంబ అమ్మవారి దర్శనానికి వెళ్లేందుకు వారు ప్రయాణిస్తున్నట్లు తెలిపారు.ఉదయం సుమారు 7 గంటల సమయంలో హైదరాబాద్-కర్నూలు మార్గంలోని ఎన్‌హెచ్-44పై10వ బెటాలియన్ పెట్రోల్ పంప్ ఎదురుగా కారు ప్రమాదానికి గురైనట్లు ముఖేష్ ఫోన్ ద్వారా మాధురికి సమాచారం అందించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ప్రమాదంలో వెనుక సీటులో ఉన్న సాయిరాం, వతానిక్‌లకు తీవ్ర తల గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదంలో కారు డ్రైవర్ ముఖేష్, రాఘవకు కూడా గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. మృతదేహాలను గద్వాల ప్రభుత్వ ఆసుపత్రి (జి జి హెచ్) మార్చురీకి తరలించగా, అక్కడికి వెళ్లి చూడగా తన భర్త సాయిరాం మృతి చెందినట్లు మాధురి తెలిపారు.

**అతివేగం,నిర్లక్ష్యమే కారణమని ఫిర్యాదు**

ముఖేష్ కారు అతివేగంగా,అజాగ్రత్తగా,నిర్లక్ష్యంగా నడపడం వల్ల ముందు వెళ్తున్న ఎంపీ14 హెచ్ జి 2277 నంబర్ గల లారీని వెనుక నుంచి ఢీకొట్టినట్లు ఫిర్యాదులో ఆరోపించారు.ఈ ప్రమాదానికి కారణమైనట్లు పేర్కొన్న కారు డ్రైవర్ ముఖేష్ పాముకుంట్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాధురి పోలీసులను కోరారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# వార్డు మెంబర్ల గళం గౌరవ వేతనమే లక్ష్యం!

**మహమ్మాదాబాద్ సెప్టెంబర్ 6(ప్రజా జ్యోతి )**

స్థానిక సమస్యల పరిష్కారం లో కీలక పాత్ర పోషిస్తున్న వార్డు సభ్యుల సంక్షేమనికి ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, నెలకు గౌరవ వేతనంమంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్ లో రాష్ట్ర స్థాయి వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షురాలు నాగబెల్లి జ్యోతి మహేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మహబూబ్నగర్ జిల్లా ఇంచార్జి చిన్నారెడ్డి మాట్లాడుతూ త్వరలో మండల కమిటీలు పూర్తి చేసి జిల్లా లో ఉన్న వార్డు సభ్యుల సమస్య లు సంక్షేమసాధనకు గౌరవ వేతన సాధన కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర వార్డు సభ్యుల లీగల్ టీం తో పాటు అన్ని జిల్లాల ఇంచార్జ్ లు పాల్గొన్నారు



# ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన

## “శంకర “కంటి ఆస్పత్రి హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహణ

**మహమ్మదాబాద్ సెప్టెంబర్ 6(ప్రజా జ్యోతి)**

మండల కేంద్రం లోని బాలుర ఉన్నత పాఠశాల లోఆదివారం హైదరాబాద్ శంకర కంటి ఆస్పత్రి వైద్య బృందం పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు చేయించు కోవ డానికి మొత్తం 152 మంది హాజరయ్యారు. వీరిలో 26 మందికి కంటి శుక్లాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఆపరేషన్ నిమిత్తం హైదరాబాద్ లో శంకర కంటి ఆస్పత్రికి తరలించి ఆపరేషన్ పూర్తయ్యాక రెండు రోజుల్లో తిరిగి వారి సొంత గ్రామాలకు  ఆస్పత్రి వారే చేర వేస్తారని  నిర్వాహకుడు రాహత్ ఆలీ తెలిపారు. ఈ కార్యక్రమం లో వైద్యులు డాక్టర్ మరియా, తులసి ఆయాన్ తో పాటు మాజీ ఎం పి పి శాంతి రంగ్యా, డి సి సి సభ్యులు అనంతయ్య గుప్తా, వేణు గౌడ్ లాలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

## పుల్గర్‌చర్లకు మంచి పేరు తెచ్చిన నరేష్ యాదవ్‌కు అభినందనల వెల్లువ

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్ :**

మండల పరిధిలోని పుల్గర్‌చర్ల గ్రామానికి చెందిన బత్తుల నరేష్ యాదవ్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక కావడంతో ఆయనను బీఆర్ఎస్ నాయకులు బాబిరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా బాబిరెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తికి నరేష్ యాదవ్ అందిస్తున్న సేవలకు గుర్తింపుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి పురస్కారం లభించడం ఎంతో గర్వకారణమన్నారు. తన సేవలతో పుల్గర్‌చర్ల గ్రామానికి మంచి గుర్తింపు తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వద్దే తిరుపతయ్య, నరేష్, వద్దే శీను, బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.



# పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**పారిశుద్ధ్య కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను దారి మళ్లించిన రాష్ట్ర ప్రభుత్వం.**

**పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెల ఒకటో తారీకుని జీతాలు చెల్లించాలి.**

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**

మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు, వీపనగండ్ల కల్వరాల గ్రామ బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని, వారికి తగిన గౌరవం కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చి ఇంతకాలం గడిచినా ఆ హామీలను అమలు చేయకుండా పారిశుద్ధ్య కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజల ఆరోగ్యం కోసం ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస గౌరవ వేతనం కూడా అందించకపోవడం బాధాకరమని అన్నారు. సమాజాన్ని పరిశుభ్రంగా ఉంచే కార్మికుల శ్రమను గుర్తించి వారికి గౌరవప్రదమైన వేతనం, ఉద్యోగ భద్రత, అవసరమైన రక్షణ పరికరాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పారిశుద్ధ్య కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకుంటూ, వారి శ్రమకు తగిన గౌరవం ఇవ్వకపోవడం సరికాదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా కళ్లు తెరిచి పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఎన్నికల హామీ మేరకు 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పిన హామీలను నెరవేర్చాలని, కనీస గౌరవ వేతనం వెంటనే పెంచి చెల్లించాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. పారిశుద్ధ్య కార్మికుల హక్కుల కోసం బిఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని, వారి సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే మరిన్ని ప్రజా ఉద్యమాలు చేపడతామని బి ఆర్ ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టిఆర్ఎస్ నాయకులు జున్ను నారాయణ ముంత శివ మాల కురుమయ్య శేఖర్ మీసాల శివ జుర్రు నారాయణ రఘునాథ్ రెడ్డి దయాకర్ రెడ్డి, గురక కుమార్, స్వాములు ,గురక వెంకటేష్, బండారి బాబు, గణేష్, నాగరాజు, నగరాల అంజి ,గొంది నరసింహారెడ్డి. శ్రీనివాసులు, రవీంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





# 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో కంపుకొడుతున్న గ్రామ పల్లెలు బాసు హనుమంతు నాయుడు

**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 06:**

గట్టు మండల గ్రామాలలో కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని బీఆర్ఎస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల హనుమంతు నాయుడు విమర్శించారు. కేటీఆర్ పిలుపు మేరకు గట్టు, రాయపురం గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టి,గట్టులో భారీ ర్యాలీ నిర్వహించి పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో చెత్త సేకరణ,డ్రైనేజీ శుభ్రత,వీధి దీపాల నిర్వహణ వంటి పనులునిలిచిపోయాయనిఆరోపించారు.పంచాయతీ కార్మికులకు వేతనాలు,పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.రేవంత్‌రెడ్డి పోవాలి.మళ్లీ కేసీఆర్ రావాలి"అంటూ నినాదాలు చేశారు.ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,సర్పంచులు,కార్యకర్తలు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# తెలంగాణ జాక్ ఉద్యోగుల సంకల్ప సభ విజయవంతం

**- సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి సనాతన భాగస్వామి**

**నాగర్ కర్నూల్ సెప్టెంబర్ 6 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

ఈరోజు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్, హైదరాబాద్ లో జరిగిన సభలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయులు భారీ ఎత్తున తరలివచ్చి ఉద్యోగుల సంకల్ప యాత్రను విజయవంతం చేశారని సీపి ఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కోశాధికారి సనాతన బాలస్వామి అన్నారు.ఇందులో తెలంగాణ జాబ్ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకు వెళ్తున్నారని తద్వారా ఎక్కువ ఫలితాలు వస్తున్నాయని ప్రజలకు ప్రభుత్వానికి ఉద్యోగులు వారిదిగా ఉంటున్నారని ఉద్యోగుల పిఆర్సి డి ఏ లను వెంటనే విడుదల చేయాలని అదేవిధంగా సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని అన్నారు అదేవిధంగా ప్రభుత్వం దగ్గర ఉన్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దర్శన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, రాష్ట్ర కోశాధికారి సనాతన బాలస్వామి, రాష్ట్ర నాయకులు ఈశ్వర్, సందీప్, మురుగప్ప, అనిల్ పటోళ్ల, మల్లేష్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు



# సరిత జన్మదిన సందర్భంగా హ్యాట్రిక్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన సరితమ్మ

**గద్వాల (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 06:**

తెలంగాణ రాష్ట్ర షీప్స్ అండ్ గోట్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని సరిత తిరుపతయ్య సేవ ఎస్.ఆర్.టి.పి దళం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరి గానే ఈ సంవత్సరం కాంగ్రెస్ పార్టీ సరిత క్యాంప్ కార్యాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని సరిత రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా హ్యాట్రిక్ రక్తదాన శిబిరంలో పాల్గొన్న దాతలను ఆమెఅభినందించారు. మొత్తం 70 యూనిట్ల రక్తం సేకరణ చేయడం జరిగింది. అనంతరం సరితమ్మ మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని అన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం మహాదానం అని, మనం ఇచ్చే రక్తం అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి ప్రాణదానంగా మారుతుందని పేర్కొన్నారు. యువత స్వచ్ఛందంగా రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ సార్ టిపి దళం సభ్యులు జనరల్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంకు సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ జిల్లా, తాలూకా, మండల ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత తదితరులు పాల్గొన్నారు.





# ఏఐకేఎంఎస్ 9వ మహాసభలను జయప్రదం చేయండి

**గద్వాల ప్రజా జ్యోతి సెప్టెంబర్ 06:**

మంచిర్యాలలో సెప్టెంబర్ 8,9 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) తెలంగాణ రాష్ట్ర 9వ మహాసభలను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జమ్మిచేడు కార్తీక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఐజ పట్టణంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. రైతాంగ వ్యతిరేక విధానాలు, గిట్టుబాటు ధర లేకపోవడం, నకిలీ విత్తనాలు, అసమాన వాణిజ్య ఒప్పందాలతో రైతులు నష్టపోతున్నారని ఆయన అన్నారు. రైతు కూలీల సమస్యలపై మహాసభల్లో చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్‌కుమార్, కాజా బీసన్న, సవరణ దేవన్న, సుధాకర్, రామకృష్ణ, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.



# బైరంపల్లి గ్రామంలో ఉచిత వైద్య క్యాంపు

## - కర్నూలు మెడికేర్ హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించారు

**అలంపూర్ డివిజన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 06:**

జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ నియోజకవర్గం అలంపూర్ మండలం బైరంపల్లి గ్రామంలో ఆదివారం కర్నూల్ ఎన్ ఆర్ పేటలో ఉన్నటువంటి మెడికేర్ హాస్పటల్ వారు పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించాలని ఉద్దేశంతో బైరంపల్లి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య క్యాంపు నిర్వహించరు. ఈ క్యాంపులో హాజరైనటువంటి డాక్టర్లు ఫిజీషియన్ డాక్టర్ భరత్ కుమార్, డాక్టర్ సమీర్ పాల్గొని అనేక రోగులకు షుగరు, బిపి, గుండె పరీక్ష లు చేసి వారికి తగిన మందులు ఉచితంగా ఇచ్చి వారికి ఆరోగ్యంపై అవగాహన కల్పించి జాగ్రత్తగా ఆరోగ్యం కాపాడుకోవాలని రోగులకు సూచించారు.



# పాలెం "ఆదర్శ పాఠశాల" పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

## - డా.శ్రీనివాస్ ను సన్మానించిన బాల్య మిత్రులు






**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 06 : (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ జిల్లా బిజినపల్లి మండల పరిధిలోని పాలెం గ్రామంలో గల ఆదర్శ ఉన్నత పాఠశాల 1987-88 పదోతరగతి బ్యాచ్ కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని బాలాజీ ఫంక్షన్ హాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నో ఏళ్లతరువాత కలుసుకున్న బాల్య మిత్రులు చిన్ననాటి జ్ఞాపకాలను నెరవేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ శుభ సందర్భంగా మార్షల్ ఆర్ట్స్ లో రెండు సార్లు గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డు సాధించిన డా.తెప్ప శ్రీనివాస్ ను బాల్య మిత్రులు ఘనంగా సన్మానించారు. అనంతరం డా. శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్ననాటి స్నేహితుల చేతుల మీదుగా సన్మానం అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని, బాల్య మిత్రుల ఆత్మీయ కలయిక ఎంతో ఆనందాన్ని కలిగించిందని అన్నారు. ఈ సందర్భంగా బాల్య స్నేహితులు మాట్లాడుతూ మా చిన్ననాటి స్నేహితుడైన తెప్ప శ్రీనివాస్ చేసిన సమాజ సేవలకు డాక్టరేట్ లభించుడం అభినందనీయమని, సుబ్బయ్య పాలెం గ్రామానికి శ్రీనివాస్ మరో ఆణిముత్యమని పాలెం గ్రామానికే గర్వకారణమని కొనియాడారు. చిన్ననాటి నుండి మార్షల్ ఆర్ట్స్ పై ఆసక్తితో సాధన కొనసాగిస్తూ అనేక సంవత్సరాలుగా విద్యార్థులకు మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ ఇస్తూ తన ప్రతిభను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటుకున్నందుకు మిత్ర బృందం అభినందనలు తెలుపుతున్నామని, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన మా బాల్యమిత్రుడు మాకెంతో గర్వ కారణమని కొనియాడారు. అదేవిదంగా లయన్స్ క్లబ్ మరియు"సేవా ఫౌండేషన్"ఆధ్వర్యంలో ఎన్నో సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను, సమాజసేవకు ఆయన చేసిన కృషికి లభించిన డాక్టరేట్ సందర్భంగా అభినందిస్తున్నట్లు స్నేహితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలెం గ్రామ ప్రజలు, నేతాజీ యువజనసంఘ సభ్యులు, 1987-88బ్యాచ్ మిత్రులు పాల్గొన్నారు.

# మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దేవరపాగ ప్రభాకర్

**నాగర్ కర్నూల్ : సెప్టెంబర్ 06 (ప్రజా జ్యోతి)**



తెలంగాణ రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దేవరపాగ ప్రభాకర్ మాది గ ఎంపిక అయినట్లు సంఘం నాయకులు తిలిపారు. దేవరపాగ ప్రభాకర్ వీఠాూ ఆవిర్భావం నుండికార్యకర్తగా పనిచేస్తూ, ఉద్యోగం వచ్చిన తర్వాత జిల్లా నుండి ఐదుసార్లు ఎం.ఈ.ఎఫ్ జిల్లా అధ్యక్షునిగా సమర్థవంతంగా కొనసాగుతూ జాతి ప్రయోజనాల కోసం మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు బాధ్యతగా పనిచేయడంతో ఆయన కృషిని గుర్తించి జాతీయ నాయకత్వం ఈ బాధ్యతలు అప్పగించిందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా దేవరపాగ ప్రభాకర్ మాట్లాడుతూ ఈ పదవితో నా పైన బాధ్యత మరింత పెరిగిందని నాపై అపారమైన నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన మందకృష్ణ మాదిగ గారికి, జాతీయ నాయకత్వానికి శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

# ఉద్యమకారుడు పల్లె రవికి కన్నీటి వీడ్కోలు

## అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 6 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పల్లె రవి అకాల మరణంతో ఉద్యమ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పల్లె రవి అంతిమయాత్రలో మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ పాల్గొని ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా తెలంగాణ చౌరస్తా వద్ద పల్లె రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ పార్టీ బలోపేతానికి, ఉద్యమ కార్యక్రమాలకు పల్లె రవి అందించిన సేవలను ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ స్మరించుకున్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి బీఆర్ఎస్ పార్టీ వరకు పల్లె రవి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆయన పేర్కొన్నారు. పల్లె రవి అకాల మరణం పార్టీకి, తెలంగాణ ఉద్యమ కుటుంబానికి తీరని లోటని అన్నారు. పల్లె రవి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.



# కాంగ్రెస్ పాలనకు కౌంట్‌డౌన్ మొదలైంది!

## - ఆటో కార్మికుల నుంచి రైతులు, ఉద్యోగుల వరకు అందరూ ఇబ్బందుల్లోనే..

## మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్

మొదటిపేజీ తరువాయి

**మహబూబ్‌నగర్ సెప్టెంబర్ 6( ప్రజా జ్యోతి బ్యూరో ):**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి విరసనోల్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఆటో కార్మికుల కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందని శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల పాఠశాల ఫీజులు, నెలవారీ కిస్తులు చెల్లించలేని పరిస్థితిలో అనేక ఆటో కార్మికుల కుటుంబాలు ఉన్నాయని అన్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు దానిని ఏర్పాటు చేయలేదని విమర్శించారు. ఆటో కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, ఎన్నికల హామీలో భాగంగా నెలకు రూ.12 వేల ఆర్థిక సహాయం ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని, ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ఆటో కార్మికుల కుటుంబాలు కనీస అవసరాలు తీర్చుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు.

**హామీల అమలులో కాంగ్రెస్ విఫలం:**

కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, తులం బంగారం వంటి పథకాలను అమలు చేయడం లేదని, పెంచుతామని చెప్పిన పెన్షన్లను కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పీఆర్సీ, ఎరియర్స్, మెడికల్ బిల్లుల విషయంలోనూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు.ఉచిత బస్సు ప్రయాణం పేరుతో మహిళలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని అన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినప్పటికీ బస్సుల సంఖ్య పెంచకపోవడంతో రద్దీ కారణంగా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. మరోవైపు పురుషుల టికెట్ ధరలను పెంచారని విమర్శించారు.

**రైతులకు కరెంట్ లేదు.. యూరియా దొరకడం లేదు:**

వ్యవసాయ రంగంపైనా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి ఆరోపించారు. వ్యవసాయానికి సరిపడా విద్యుత్ అందక పంటలు ఎండిపోతున్నాయని, యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతు మరణించినా రైతు బీమా అందని పరిస్థితులు ఉన్నాయని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు, నేత కార్మికులు, గీత కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందక తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు.

**అభివృద్ధి పనులకు బ్రేక్ ఎందుకు?**

మహబూబ్‌నగర్‌లో నిర్మించిన వెయ్యి పడకల ఆసుపత్రి భవనాన్ని పూర్తి చేసి, అవసరమైన వసతులు కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. టూరిజం హోటల్ నిర్మాణ పనులను కూడా నిలిపివేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆటో కార్మికులు సహా పలు వర్గాల కుటుంబాలకు ఒక భరోసా ఉండేదని ఆయన పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను కొనసాగించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.

**మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది:**

ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపితే వాటిని సరిదిద్దుకోవాల్సింది పోయి కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను ప్రతి






ఇంటికీ తీసుకెళ్లాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకుల బెదిరింపులకు ఎవరూ భయపడవద్దని, భవిష్యత్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన అనంతరం మహబూబ్‌నగర్‌ను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, ముడా మాజీ చైర్మన్ వెంకన్న, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, కార్పొరేటర్లు నవకాంత్, కుర్వ శ్రీశైలం, నరేష్, నరేందర్, గణేష్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీను నాయక్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 09న శోభ ఆప్టికల్ లో ఉచిత కంటి చికిత్స శిబిరం

**నాగర్ కర్నూల్ : 06 సెప్టెంబర్ (ప్రజా జ్యోతి)**

జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న,నాగర్ కర్నూలు జిల్లా కేంద్రంలోని రాంన
గర్ కాలనీ,రామకృష్ణ టాకీస్ రోడ్డులోని శోభ ఆప్టి కల్ లో ఉదయం 9 గంటలకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఆప్తాలమిక్ అధికారి బి.శివారెడ్డి ఆదివారం ఓ ప్రకటన లో తెలిపారు. ఈ శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి క్యాటరాక్ట్ పొరగల వారినీ ప్రత్యేక అంబులెన్స్ లో మహబూబ్ నగర్ లోని లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి పంపించి ఉచిత ఆపరేషన్లు నిర్వహించనునట్లు తెలిపారు.రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా రక్తపరీక్షలు,సాధారణ పరీక్షలు,ప్రతిరోజు నిర్వహిస్తారని,శిబిరానికివచ్చే ముందు ఆధార్ కార్డు,ఓటర్,లేదా రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440454284,8106333324 నెం:లలో సంప్ర దించాలని కోరారు.

# ఎస్ఐఆర్ ప్రత్యేక ప్రచారానికి వేగం.. పోలింగ్ కేంద్రాల్లో అదనపు కలెక్టర్ తనిఖీలు

## - ఓటర్ల జాబితా ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావివ్వొద్దు : మధుసూదన్ నాయక్

**మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 6 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

ఎస్ఐఆర్ ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో భాగంగా జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో ప్రత్యేక దృష్టి సారించారు. సెప్టెంబర్ 5, 6, 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదివారం దేవరకద్ర నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. అడ్డాకల్ మండలం శక్రాపూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 103, 104లను సందర్శించిన అదనపు కలెక్టర్ అక్కడ చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించడంతో పాటు ఎన్నికల సంబంధిత కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా, సమర్థవంతంగా జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో ఉండాలని అధికారులకు సూచించారు.అనంతరం మూసాపేట మండలం జనంపేట గ్రామంలోని పోలింగ్ కేంద్రాలు 81, 82, 83, 84లను పరిశీలించారు. ఓటర్ల జాబితాకు సంబంధించిన పనులను ఎన్నికల నిబంధనల ప్రకారం పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరుకు అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా భూత్పూర్ మండలం పోతుగుట్ట తండాలోని పోలింగ్ కేంద్రం 24ను తనిఖీ చేసిన మధుసూదన్ నాయక్ ఎన్నికల పనుల పురోగతిని సమీక్షించారు. ఓటర్ల జాబితా రూపకల్పన, సవరణ ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా నిబంధనల మేరకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రచార రోజులను సద్వినియోగం చేసుకుని అర్హులైన ఓటర్లకు సంబంధించిన వివరాల నమోదు, సవరణలు తదితర ప్రక్రియలను సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులు, బీఎల్ఓలకు సూచించారు. ఈ తనిఖీల్లో సంబంధిత మండలాల ఎంపీడీఓలు, తహసీల్దార్లు/ఏఈఆర్ఓలు, ఆర్ఐలు, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, జీపీఓలు, పీఎస్‌లు, సర్పంచ్‌లు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.



# పద్మశాలి సేవా పురస్కారంతో పులిపాటి వెంకటేశ్‌కు ఘన సన్మానం

## - హన్మకొండలో నేతన్న టీవీ, స్వరాజ్ న్యూస్ తొలి వార్షికోత్సవ వేడుకలు

**గద్వాల సెప్టెంబర్ 06 (ప్రజా జ్యోతి ప్రతినిధి):**

కాకతీయ సామ్రాజ్య రాజధానిగా ప్రసిద్ధి చెందిన హన్మకొండలో నేతన్న టీవీ,స్వరాజ్ న్యూస్ సంస్థల తొలి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పద్మశాలి సమాజ సేవతో పాటు వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సేవాతత్పరులను ఎంపిక చేసి ప్రోత్సాహకంగా వివిధ పురస్కారాలను ప్రదానం చేశారు.ఈ సందర్భంగా గద్వాల జిల్లా పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు పులిపాటి వెంకటేశ్కు పద్మశాలి సేవా పురస్కారం అందజేసి ఘనంగా సన్మానించారు.సమాజ సేవలో ఆయన అందిస్తున్న సేవలను అభినందించిన నిర్వాహకులు,భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమానికి కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ నూతన చైర్మన్ గుండు సుధారాణి,జాతీయ పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి,తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కామర్తపు మురళి,ప్రధాన కార్యదర్శి మాచెర్ల రామచందర్,మాజీ శాసనసభ్యుడు వన్నాల శ్రీరాములు తదితరులు హాజరయ్యారు.ప్రముఖ అవార్డు గ్రహీతలు,తెలంగాణలోని నలుమూలల నుంచి తరలివచ్చిన పద్మశాలి కులబాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా పురస్కారాలు అందించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.



# కేసీఆర్‌కు ఎమ్మెల్యే పదవి ఎందుకు? రాజీనామా చేయాల్సిందే!

## - ఇందిరాపార్క్ వద్ద కాంగ్రెస్ మహా ధర్నా.. ప్రజలకు జవాబుదారీగా ఉండాలని డిమాండ్

**మహబూబ్ నగర్ సెప్టెంబర్ 6 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహా ధర్నా నిర్వహించారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహబూబ్ నగర్ డిసిసి అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మహా ధర్నాలో పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేసీఆర్ ఎమ్మెల్యేగా కొనసాగుతూ ప్రజలకు అందుబాటులో లేకపోవడం, అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకపోవడం పట్ల తీవ్ర విమర్శలు చేశారు.



**ప్రజల సమస్యలపై అసెంబ్లీలో గళం వినిపించాలి:**

ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు అసెంబ్లీ సమావేశాలకు హాజరై ప్రజా సమస్యలను ప్రస్తావించాల్సిన బాధ్యత ఉందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా కొనసాగుతూ జీతం తీసుకుంటున్నప్పటికీ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా, ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించని పక్షంలో పదవిలో కొనసాగడం సమంజసం కాదని వారు అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని, ప్రజల ఓట్లతో ఎన్నికైన ప్రతినిధులు ప్రజల తరఫున చట్టసభల్లో తమ గొంతు వినిపించాల్సిన బాధ్యత ఉందని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు.

**కాంగ్రెస్ శ్రేణుల భారీ సమీకరణ:**

ఈ మహా ధర్నాలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సంజీవ్ ముదిరాజ్, వనపర్తి డీసీసీ అధ్యక్షుడు శివసేన రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపీ మిథున్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సత్తూర్ చంద్రకుమార్ గౌడ్, టీపీసీసీ అధికార ప్రతినిధి జహీర్ అక్తర్ తదితరులు పాల్గొన్నారు.వీరితో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, డీసీసీ నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కేసీఆర్ రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు.కేసీఆర్ ఎమ్మెల్యేగా ప్రజలకు, శాసనసభకు జవాబుదారీగా వ్యవహరించాలని, లేకుంటే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# మాజీ సర్పంచ్ బత్తుల అంజన్న యాదవ్ మృతి

**- కొన్నూరుకు చేరుకుని నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి**

**మదనాపురం, సెప్టెంబర్ 6 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మదనాపురం మండలం కొన్నూరు గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బావర్చి మహేష్ తండ్రి బత్తుల అంజన్న యాదవ్ ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కొన్నూరు గ్రామానికి చేరుకుని అంజన్న యాదవ్ పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అంజన్న యాదవ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, అంజన్న యాదవ్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే పాల్గొని అంజన్న యాదవ్ అంతిమయాత్రలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా అంజన్న యాదవ్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆకాంక్షించారు. అంజన్న యాదవ్ మృతితో కొన్నూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన ఆయనను పలువురు గ్రామస్తులు, బంధుమిత్రులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు స్మరించుకుంటూ సంతాపం వ్యక్తం చేశారు.



# రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా కృష్ణారెడ్డి

**రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఇబ్రహీంబాద్ కృష్ణారెడ్డి**

**గండీడ్:**

మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం జంగం రెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఇబ్రహీంబాద్ కృష్ణారెడ్డి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా కృష్ణారెడ్డిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు అభినందించారు.




# చిన్నంబావిలో పగిడ్యాల శ్రావణి పర్యటన

**- టీఆర్ఎస్ జెండా దిమ్మెకు స్థల పరిశీలన**

**త్వరలో భారీ బహిరంగ సభ.. జెండా ఆవిష్కరణకు సన్నాహాలు**

**చిన్నంబావి, సెప్టెంబర్ 6 (ప్రజాజ్యోతి)**

తెలంగాణ రక్షణ సేన పార్టీ కొల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పగిడ్యాల శ్రావణి ఆదివారం చిన్నంబావి మండల కేంద్రంలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను కలిసి గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వ్యవసాయ రంగ సమస్యలు, ఇతర ప్రజా సమస్యలపై ఆమె ఆరా తీశారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని పగిడ్యాల శ్రావణి డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మీడియా దృష్టికి తీసుకెళ్లేందుకు పగిడ్యాల శ్రావణి విలేకరుల సమావేశం నిర్వహించారు. రైతులకు అండగా నిలవడంతో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ సేన నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం, అధికారుల నుంచి స్పందన వచ్చే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు.

**జెండా దిమ్మెకు స్థల పరిశీలన**

చిన్నంబావి మండల కేంద్రంలో టీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నూతనంగా జెండా దిమ్మె ఏర్పాటు చేసి పార్టీ జెండాను ఆవిష్కరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పగిడ్యాల శ్రావణి నేతృత్వంలో పార్టీ నాయకులు మండల కేంద్రంలో పర్యటించి జెండా దిమ్మె ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. జెండా ఆవిష్కరణ సందర్భంగా త్వరలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేయడంతో పాటు కార్యకర్తలను పెద్ద సంఖ్యలో సమీకరించి సభను విజయవంతం చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రక్షణ సేన పార్టీ వనపర్తి జిల్లా ఇన్‌చార్జి కరాటే శ్రీనుసాగర్, వనమాల ప్రదీప్‌కుమార్, టీఆర్ఎస్ పార్టీ నాయకురాలు రుద్రమోని ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



